క్లుప్తంగా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని చించల్‌పేట గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీడీఓ అనురాధ, నాయకులు నాగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, బల్వంత్‌రెడ్డి, బాల్‌రాజ్, రవీందర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవనోనిగూడకు చెందిన పాండరయ్య భార్య అనంతమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు ఆస్పత్రి ఖర్చుల కోసం మంజూరైన రూ.లక్ష చెక్కును గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, మండల నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెల అందజేత



ధారూరు: మండలంలోని మున్నూరుసోమారంలో పేదింటి యువతి వివాహానికి పుస్తెమెట్టెలను ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవీందర్ గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన మంగళి సత్యయ్య కూతురు పెళ్లికి ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాళి, మెట్టెలను ఉచితంగా అందజేసి ఆశీర్వదించారు.

మొలకెత్తినా.. పట్టించుకోరా?

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు



మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న బీజేపీ నాయకులు

బొంరాస్‌పేట: అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసి, మొలకెత్తిందని బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం పార్టీ నాయకులు మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం మొలకెత్తినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. వందల కొద్ది బస్తాల ధాన్యం పేరుకుపోతున్నా లారీల్లో తరలించే ప్రయత్నం కనిపించడం లేదన్నారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా, ధాన్యం తడవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే రైతులతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రావణ్ తదితరులున్నారు.

బొంరాస్‌పేట ఎంపీడీఓగా వినోద్‌కుమార్



బొంరాస్‌పేట: ఏడాది నుంచి ఇన్‌చార్జి ఎంపీడీఓలతో కాలం గడుస్తున్న తరుణంలో ఎట్టకేలకు బొంరాస్‌పేట ఎంపీడీఓగా పి.వినోద్‌కుమార్ గురువారం నియమితులయ్యారు. సూపరింటెండెంట్‌గా ఉన్న వెంకన్నగౌడ్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉండగా మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్‌లో ఉన్న వినోద్‌కుమార్ తాజాగా ఎంపీడీఓగా నిమితులయ్యారు.

సేంద్రియ సాగుపై అనాసక్తి!

- అవగాహన కల్పించని వ్యవసాయ అధికారులు
- రసాయన ఎరువుల వైపు మొగ్గు
- అధిక భారంతో నష్టపోతున్న రైతులు



నారెగూడలో భూసారం పెంచేందుకు పొలంలో వేసిన గొర్రెల మంద

నవాబుపేట: సేంద్రియ ఎరువులపై అధికారులు సరైన ప్రచారం చేయకపోవడంతో వీటి వినియోగంపై రైతులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా గ్రామాల్లో ఇంకా రసాయన ఎరువులనే ఎక్కువగా వాడుతున్నారు. ఏటా పెట్టుబడులు పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. ఈ సమస్య నుంచి అన్నదాతలు బయట పడేందుకు సహజసిద్ధ ఎరువుల వినియోగం ఒక్కటే మార్గం. అలాంటి వ్యవసాయం ప్రస్తుతం గ్రామాల్లో కనుమరుగవుతుంది. సేంద్రియ ఎరువుల తయారీ విధానం, వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంపై మండల వ్యవసాయ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో ఖరీఫ్ సీజన్ కింద 27,234 ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నారు. వీటికి 3,960 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయి.

సలహాలు, సూచనలు కరువు

రసాయన ఎరువుల వాడకం రైతులకు భారం అవుతుంది. వీటి వినియోగంతో భూసారం కూడా తగ్గుతుంది. సరైన దిగుబడులు రావు. పర్యావరణంపై రసాయనిక ఎరువుల ప్రభావం చూపుతుంది. సేంద్రియ ఎరువులు వేస్తే చీడపీడల బెడద తప్పడంతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చు. వ్యవసాయంలో సరైన సలహాలు, సూచనలు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం భిన్నంగా ఉంది. దీంతో కర్షకులు పంటకు సోకిన రోగాలకు ఏ దశలో ఏ మందులు వాడాలో తెలియక ఎరువుల వ్యాపారులు ఇచ్చే చవకబారు, నాణ్యతలేని నకిలీ మందులు వాడుతూ నష్టపోతున్నారు. సేంద్రియ ఎరువులు ఆరుతడి పంటలకు, కూరగాయల సాగుకు ఎంతో ఉపయోగపడతాయి.

రైతు ఇంట సిరులు

సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి సైతం మంచివని వైద్యులు సూచిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా ఆకులు, అలములు, చెత్తాచెదారంతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చు. ముందుగా తమకు అవసరమున్న కుండీలను ఏర్పాటు చేసుకొని ముడి సరుకు సేకరించి కొంత వరకు నీటిలో వేసి దాదాపు 45 రోజులు నిల్వ ఉంచితే ఎరువు తయారు అవుతుంది. తరువాత దానిని పంటలకు ఉపయోగించవచ్చు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరగడమే కాకుండా అధిక దిగుబడులు పొందవచ్చు. చెరువు ఒండ్రు మట్టిని తరలించుకోవడం, జీలుగ పంటను సాగు చేసుకొని పొలంలో కలియదున్నడం లాంటి పద్ధతులు పాటించాలి. ఎక్కువ మొత్తం రసాయనాలు వాడే భూముల్లో అప్పుడప్పుడు సేంద్రియ ఎరువులు వేస్తే భూసారం సమతుల్యంగా ఉంటుంది. పశువుల ఎరువులు, పొల్లాల్లో గొర్రెల మందలు వేయడం ద్వారా దిగుబడులు అధికంగా వస్తాయి. సహజ ఎరువులతో పండించిన ఆహార ధాన్యాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తాం



సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తాం. అన్నదాతలు అందుబాటులో ఉండే పశువులు, గొర్రెల పేడను పొలాల్లో వేసుకోవాలి. జీవన ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇదివరకు వర్మి కంపోస్టు బెడ్లు, వానపాములు వచ్చేవి. కానీ ప్రస్తుతం అవి రావడం లేదు.

– జ్యోతి, మండల వ్యవసాయాధికారి

వీర జవాన్లకు జోహార్లు

బంట్వారం: ఆపరేషన్ సిందూర్ విజయంపై బంట్వారం మండల కేంద్రంలో గురువారం త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్‌యాదవ్, నాయకులు మల్లేశం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బంట్వారంలో త్రివర్ణ పతాకాలతో ర్యాలీ

ఆరుబయటే వడ్లు



పగిడియాల శివారులో ఆరుబయట నిల్వ ఉంచిన ధాన్యం కుప్పలు



బాగాయిపల్లిలో సంచుల్లో ధాన్యం నింపి కప్పిన కవర్లు

కొనుగోలు కేంద్రం లేక అవస్థలు పడుతున్న రైతులు

యాలాల: మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామమైన పగిడియాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పడరానీ పాట్లు పడుతున్నారు. ప్రతి ఏడాది డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఇక్కడ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేవారు. కానీ ఈసారి అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక రైతులు ధాన్యం విక్రయించేందుకు ఇక్కట్లు పడుతున్నారు. పగిడియాలతో పాటు బాగాయిపల్లి గ్రామాల్లో గతంలో కొనుగోలు ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఏడాది కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యం రాశులు ఆరుబయటే ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు గ్రామాల్లో రైతుల నుంచి సుమారు 10 వేలకు పైగా బస్తాలు కేంద్రానికి వచ్చేవి. ధాన్యం కొనుగోలు కేంద్రం విషయమై ఇటీవల స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, గన్నీ బ్యాగులు(సంచులు) పంపిణీ చేశారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి చేయకపోవడంతో ధాన్యం కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాయకులు, అధికారులు దృష్టి సారించి పగిడియాలలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మెరుగైన బోధన తప్పనిసరి



శిక్షణ కార్యక్రమంలో టీఎల్‌ఎం ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల్: తరగతి గదిలో విద్యార్థులకు మెరుగైన బోధన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని మండల విద్యాధికారి విజయరామారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఎస్టీటీ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నప్పుడు విద్యార్థికి పూర్తిస్థాయిలో విషయంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు టీఎల్‌ఎం(బోధన అభ్యసన ఉపకరణాలు) తప్పకుండా వినియోగించాలని, అప్పుడే విద్యార్థి తరగతి గదికి ఆకర్షణ పొందుతాడని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, శంకరప్ప, తేజస్విని, సక్కుబాయి, సంపత్ కుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో టీబీ ముక్త్ అభియాన్

ధారూర్: మండల పరిధిలోని నాగసముందర్ పీహెచ్‌సీలో గురువారం క్షయ నివారణ అభియాన్ కార్యక్రమం ప్రారంభమయింది. ఇందులో భాగంగా వైద్యులు ప్రజలకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి ఎలా వస్తుంది, వ్యాధి లక్షణాలు, రావడానికి గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిని వివరించారు. రక్తపోటు, మధుమేహం, ధూమపానం, హెచ్ఐవీ తదితర రోగులకు 89 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మేఘన, సీహెచ్ఓ మహ్మద్ అలీ, సూపర్‌వైజర్ జంగయ్య, ఉమా, సిబ్బంది అశోక్, రాజేందర్, నరేందర్, రాధారాణి, యాదయ్య, లావణ్య, లక్ష్మి, మనీల తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌కు డాక్టరేట్

అనంతగిరి: కోట్‌పల్లి మండలం ఎన్నారం జెడ్పీహెచ్ఎస్‌లో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ ముక్తార్‌కు లండన్‌కు చెందిన గ్లోబల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. డాక్టరేట్‌ను ఈనెల 26న థాయిలాండ్‌లో జరుగుతున్న గోల్డెన్ బుద్ధ ఎడ్యుకేషనల్ అవార్డ్స్‌లో అందుకోనున్నారు. ఈ సందర్భంగా వికారాబాద్‌లో ఉపాధ్యాయ శిక్షణలో ఉన్న ముక్తార్ అహ్మద్‌ను సహచర జిల్లాలోని హిందీ ఉపాధ్యాయులంతా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధారాధామ్ శిక్షణ్ సంస్థ, దేవనాగరి ఉద్దాన్ ఫౌండేషన్ సంస్థలలో గత 14 ఏళ్లుగా పనిచేస్తున్నానని, అందులో భాగంగా తనకు డాక్టరేట్ దక్కడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హిందీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

అనంతగిరి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్ విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. ఫస్టియర్‌లో 1003 మందికి గాను 863 మంది విద్యార్థులు హాజరయ్యారు. సీనియర్ ఇంటర్‌లో 275మందికి గాను 258 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపు హర్షణీయం

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి

షాద్‌నగర్: గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థలకు గౌరవం లేకుండా ఉండేదన్నారు. గత పాలకులు ఇష్టం వచ్చినప్పుడు ట్రెజరీలో బ్యాంకు ఖాతాలను ఫ్రీజింగ్ చేశారని, దీంతో సర్పంచులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయడం అభినందనీయమన్నారు. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

మొక్కల పెంపకంతోనే వర్షాలు



స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

కొడంగల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమృత్ మిత్ర.. ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమాన్ని మహిళా సంఘాల సభ్యులు జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. గురువారం పట్టణంలో అమృత్ మిత్ర ఉమెన్ ఫర్ ట్రీస్‌పై అవగాహన కల్పించారు. స్వయం సహాయక సభ్యుల ద్వారా మొక్కలు నాటుట, వాటి సంరక్షణ బాధ్యత మహిళా సంఘాల సభ్యులదేనని అన్నారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని స్వయం సహాయక సంఘాలకు అందించనున్నట్లు తెలిపారు. మొక్కల పెంపకంతోనే సమృద్ధిగా వర్షాలు కురిసేందుకు అవకాశం ఉంటుందని, ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పట్టణ సమన్వయ అధికారి ఎం.వెంకటేష్, పర్యావరణ ఇంజనీర్ భరత్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రాజేశ్వరీ, మెప్మా రీసర్స్ పర్సన్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రసీదులు తప్పనిసరి



పీఏసీఎస్ కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న ఏఓ కొమురయ్య

తాండూరు రూరల్: మండలంలోని రైతులకు 40 వేల పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని ఏఓ కొమురయ్య తెలిపారు. గురువారం మండలంలో పలు ఫర్టిలైజర్, ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. పీఏసీఎస్ కార్యాలయం నుంచి రైతులకు డీఏపీ, యూరియా పంపిణీ చేసే విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది కాకుండా పెద్ద గోదాంను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ శ్రీనివాస్, అడిషనల్ సీఈఓ చంద్రారెడ్డిలు ఉన్నారు.

కష్టపడ్డ వారికి పదవులు దక్కడంలేదు

కాంగ్రెస్ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు జొన్నాడ రాజు

మొయినాబాద్: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పదవులు దక్కడం లేదని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు జొన్నాడ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. పార్టీలో కొత్తగా చేరినవారికి తరచూ పార్టీలు మారేవారికే పదవులు దక్కుతున్నాయని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ రెండు గ్రూపులు కావడంతో పార్టీ కార్యకర్తలు ఎవరి వెంట వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారన్నారు. నామినేటెడ్, పార్టీ పదవుల్లో ఒక వర్గానికే అధిక ప్రాధాన్యత దక్కుతుందని కష్టకాలంలో పార్టీకి పనిచేసిన వారిని విస్మరిస్తున్నారన్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కార్యకర్తలు పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. దీనిపై అధిష్టానం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు.

సమాజంలో గురువుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పూడూరు: ప్రజల భద్రత కోసం జిల్లా పోలీసు శాఖ ఎప్పుడూ పని చేస్తుందని జిల్లా ఏహెచ్‌టీయూ (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) టీం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ షేక్‌అన్వర్ పాషా అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎన్కేపల్లి మోడల్ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమాజంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారన్నారు. పాఠశాలల్లో పిల్లలు ఎదుర్కొనే సమస్యలు, మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, ఇతర నేరాల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలల హక్కులు వారి సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, పోక్సో చట్టం తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, ఏహెచ్‌టీయూ టీం హెడ్ కానిస్టేబుల్ అలీమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగి: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చి హామీలను నెరవేర్చిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసినా అన్ని సంక్షేమాలను ప్రభుత్వం ప్రజలకు అందజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేల రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కుల్కచర్ల: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు జరుగుతుందని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. గురువారం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శేరివిజయలక్ష్మి కొన్ని నెలల క్రితం అనారోగ్య సమస్య కారణంగా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంది. కాగా సీఎం సహాయ నిధి కింద ఆమెకు రూ.58 వేల చెక్కును నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నర్సింలు యాదవ్, స్థానిక పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, నాయకులు దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా హనుమాన్ జయంతి



కుల్కచర్ల: రాంరెడ్డిపల్లిలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: హనుమాన్ జన్మ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలతో గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు.

మంబాపూర్‌లో పల్లకి సేవ

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో గురువారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు స్వామివారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజన భక్తులు హనుమాన్ పల్లకీసేవ చేశారు. కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, దేవాలయ చైర్మన్ వరప్రసాద్, గ్రామస్తులు విజయ్, నర్సిములు, శ్రీనివాస్, చాకలి నర్సిములు, రాములు, భీమప్ప, బుగ్గయ్య ఉన్నారు.